సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024

డిప్యూటేషన్ రద్దు చేయాలని నిరసన

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సంధ్యను భీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై కేటాయించడాన్ని నిరసిస్తూ శనివారం వారంతా బడికి తాళం వేసి నిరసన తెలిపారు. పిల్లలకు ఉత్తమ బోధన అందిస్తూ మధ్యాహ్న భోజనం కోసం షెడ్డు సైతం నిర్మించిన ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతామన్నారు.




బడి గేటుకు తాళం వేసి నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

న్యూస్‌రీల్

రైతుల విజ్ఞప్తి మేరకే 'సాత్నాల' నీటి విడుదల

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

జైనథ్: రైతుల విజ్ఞప్తి మేరకే సాత్నాల ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రాజెక్టు అధికారులు, రైతులతో కలిసి శనివారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో పత్తికి నీటితడులు అవసరమని రైతులు తెలపగా, వారి కోరిక మేరకు విడుదల చేశామన్నారు. అలాగే ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం రూ.19 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరైతే పెండింగ్ పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో నాయకులు రాందాస్, ఆదినాథ్, రమేష్, దయాకర్, సుభాష్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని కస్తూరిబాగాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను విద్యాశాఖ భర్తీ చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం డీఈవో కార్యాలయంలో మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి ఉదయ శ్రీ, కార్యాలయ సూపరింటెండెంట్ మమతతో పాటు సిబ్బంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. జిల్లాలో 47 పోస్టులు ఖాళీగా ఉండగా 1:3 ప్రకారం 74 మందిని వెరిఫికేషన్‌కు పిలిచారు. 47 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. మరో 24 మంది నాట్ విల్లింగ్ ఇచ్చారు. తొమ్మిది మంది కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారు. ఆదివారం అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు డీఈవో తెలిపారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి భూములివ్వం


- కలెక్టరేట్ ఎదుట యాపల్‌గూడ రైతుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కైలాస్‌నగర్: రామాయిలోని రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీకి తమ భూములను ఇచ్చేదే లేదని ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ రైతులు అన్నారు. బలవంతంగా భూములను లాక్కునే యత్నాలను అధికారులు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాగు భూములను ఫ్యాక్టరీ పేరిట బలవంతంగా తీసుకునే ప్రయత్నం సరికాదన్నారు. మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.40లక్షలతో పాటు ఫ్యాక్టరీ ఏర్పాటైన తర్వాత భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తేనే భూములను ఇస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డీఈవో ప్రణీత అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మివాడ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద చదివించాలని సూచించారు. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, ప్రధానోపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



నిర్మానుష్యంగా మారిన ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్



బస్టాండ్ ఎదుట బైఠాయించిన తుడుందెబ్బ నాయకులు



బంద్ ప్రభావంతో మూసి ఉన్న దుకాణాలు

- రోడ్డెక్కని బస్సులు
- తెరుచుకోని దుకాణాలు
- నిర్మానుష్యంగా కూడళ్లు
- నిందితుడిని ఉరితీసేంత వరకు ఉద్యమిస్తాం : తుడుందెబ్బ

ఆదిలాబాద్‌రూరల్: జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారంతో పాటు హత్యాయత్నానికి పాల్పడ్డ నిందితుడిని ఉరితీయాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ శనివారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. ఈమేరకు జిల్లాలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ప్రైవేట్‌పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఆదివాసీ సంఘాల నేతలు ఉదయాన్నే బస్టాండ్‌కు చేరుకొని ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. బస్సులను రోడ్డెక్కనివ్వలే దు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. వ్యాపారులు సైతం స్వచ్ఛందంగా బంద్ పాటించడంతో దుకాణాలు తెరుచుకోలేదు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు గోడం గణేశ్ మాట్లాడుతూ, ఆదివాసీ మహిళపై అత్యాచారంతో పాటు హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత మహిళకు ప్రభుత్వ పరంగా చికిత్స అందించి ఆ కుటుంబానికి అండగా నిలువాలన్నారు. బంద్ విజయవంతానికి సహకరించిన అన్ని వర్గాలకు తుడుందెబ్బ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఇందులో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ అధ్యక్షురాలు సోయం లలిత, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సలాం వరుణ్, డివిజన్ అధ్యక్షుడు గణపతి, ఉపాధ్యక్షుడు ప్రకాశ్, రామారావు, గోవింద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన..

ఇచ్చోడ ప్రధాన రహదారి పనులు

- ఎనిమిది నెలల్లో కేవలం పది శాతం లోపే..
- మిగిలిన 10 నెలల్లో పూర్తయ్యేనా..?
- ప్రజలు, వాహనదారులకు ఇక్కట్లు



ఇచ్చోడలో కొనసాగుతున్న ప్రధాన రహదారి నిర్మాణ పనులు

సాక్షి,ఆదిలాబాద్: గతేడాది సెప్టెంబర్‌లో అప్పటి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ఇచ్చోడ ప్రధాన రహదారి నిర్మాణ పనులకు సంబంధించి భూమి పూజ చేశారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల రాకతో ఆయన పదవీకాలం పూర్తయింది. శాసనసభ ఎన్నికల్లో బోథ్ ఎమ్మెల్యేగా అనిల్ జాదవ్ గెలుపొందడంతో ఇదే రహదారి పనులను ప్రారంభించారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్ 18నెలల్లో ఈ వర్క్ పూర్తి చేసేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇప్పటికీ ఎనిమిది నెలలు గడిచిపోయింది. పనులు మాత్రం 10శాతం కూడా పూర్తి కాలేదు. మిగిలిన 10నెలల్లో పనులుపూర్తి చేయడం గగనంగానే కనిపిస్తోంది.

సంకటంగా ప్రయాణం..

ఇచ్చోడ ప్రధాన రహదారి పనులు నత్తనడకన సాగుతుండటంతో ఈ మార్గంలో ప్రయాణం సంకటంగా మారింది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఇచ్చోడ మీదుగా వెళ్తుంటాయి. నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. ప్రధాన మార్కెట్ ఇదే రహదారిపై ఉండడంతో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి నిత్యం వేలాది మంది ఇక్కడికి వస్తూ పోతుంటారు. దీంతో ఈ మార్గం ఉదయం, సాయంత్రం రద్దీగాఉంటుంది. పనులు నెమ్మదిగా సాగుతుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

ఏమిటా పనులు..

ఇచ్చోడ ప్రధానరహదారి ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే దీనికి రూ.13 కోట్లు మంజూరయ్యాయి. రోడ్లు, భవనాల (ఆర్అండ్‌బీ) శాఖ ఆధ్వర్యంలో గతేడాది టెండర్లు నిర్వహించారు. ఆన్‌లైన్ పద్ధతిలో సాగిన ఈ ప్రక్రియలో జిల్లాకు చెందిన ఒకే కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్ట్ సంస్థ బిడ్ దాఖలు చేసింది. సాధారణంగా సింగిల్ టెండర్ వస్తే అధికారులు మరోసారి టెండర్లు నిర్వహించాలి. అయితే ఈ కాంట్రాక్ట్ సంస్థ అంటే అభిమాన మో.. మరేమోగానీ అధికారులు పనులను ఆ సంస్థకే అప్పగించారు. ఇందులో మరో విశేషమేమిటంటే.. దీని అంచనా వ్యయం కంటే 4.86 శాతం ఎక్సెస్‌తో ఆ సంస్థ బిడ్ దాఖలు చేసింది. దానికి కూడా ఆర్అండ్‌బీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. త ద్వారా ఆ వర్క్‌పై అంచనా వ్యయం కంటే అదనంగా రూ.63లక్షల 18వేలు కాంట్రాక్టర్‌కు లాభం చే కూరుతుంది. మొత్తంగా ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండీ కొట్టి కాంట్రాక్ట్ సంస్థకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రయోజనం జరిగేలా వ్యవహరించారన్న అపవాదు వినిపిస్తుంది. అంతే కాకుండా ఈ పనులు నత్తనడకన సాగుతున్నా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

వర్క్ వివరాలు..

వర్క్	ఇచ్చోడ మెయిన్ రోడ్
అంచనా వ్యయం	రూ.13 కోట్లు
విస్తీర్ణం	2.7 కిలోమీటర్లు
విస్తరణ : ప్రస్తుతం ఉన్న 10 మీటర్ల నుంచి 14.50 మీటర్లకు	
మధ్యలో : 1.5 మీటర్లలో డివైడర్, సెంట్రల్ లైటింగ్, కల్వర్టు నిర్మాణం	

వచ్చే జూలై వరకు పూర్తి చేయాలి

వచ్చే ఏడాది జూలై వరకు ఈ రహదారి పనులను పూర్తి చేసేందుకు గడువు ఉంది. ఈ ఏడాది జనవరి 10న కాంట్రాక్టర్‌తో ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు రూ.80 లక్షల విలువైన పనులు జరిగాయి. అంటే సుమారు 10 శాతం పూర్తయ్యాయి.

– అరవింద్, ఏఈ, ఆర్అండ్‌బీ

'అమృత్'తో తీరనున్న దాహార్తి

- ఆదిలాబాద్ ఎంపీ నగేశ్



పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు అమృత్ పథకం ఎంతగానో దోహదపడుతుందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేఆర్కే కాలనీలో రూ.19 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి శనివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు తాగునీటి సమస్యను అధిగమించాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అమృత్ పథకంలో భాగంగా గ్రేడ్ వన్ మున్సిపాలిటీ అయిన ఆదిలాబాద్‌లో డ్రైయినేజీల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని కేఆర్కే కాలనీలో ఇక తాగునీటి సమస్య తీరనుందని అన్నారు. ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధిని దశలవారీగా చేపడుతామన్నారు. అమృత్ పథకంలో భాగంగా రూ.320 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధిని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, నాయకులు అశోక్ రెడ్డి, సాయి, రాము, స్వప్న, సురేఖ, రాజు, నాందేవ్, మున్నా, తదితరులున్నారు.

ముగిసిన అభ్యంతరాల స్వీకరణ

- ముసాయిదా ఓటరు జాబితాపై జిల్లాలో 3,192 దరఖాస్తులు
- ఇప్పటి వరకు 1,896 పరిష్కారం



అభ్యంతరాలను పరిష్కరిస్తున్న కార్యదర్శులు

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణ గడువు శనివారంతో ముగిసింది. ఈ నెల 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించిన అధికారులు వాటిని జిల్లాలోని అన్ని ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. వీటిపై ఓటర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. జిల్లాలో అందిన అభ్యంతరాలను పరిశీలిస్తే... తల్లిదండ్రుల ఓట్లు ఒక వార్డులో ఉండగా.. పిల్లల పేర్లు మరో వార్డులోకి రావడం, ఇల్లు ఒక వార్డులో ఉంటే .. ఓట్లు మరో వార్డు పరిధిలో ఉండటం.. మొన్నటి వరకు ఒక వార్డులో నివాసముండి ఆ ఇంటిని విక్రయించి మరో వార్డుకు నివాసం మారినా అదే ఇంటిలో ఉన్నట్లుగా పేర్లు ఉండటం వంటి కారణాలపైనే అత్యధికంగా దరఖాస్తులు అందాయి. వీటిపై ఈ నెల 14 నుంచి 21వరకు స్వీకరణ గడువు ఉండగా జిల్లా వ్యాప్తంగా 3,192 దరఖాస్తులు అందాయి. చివరి రోజు అత్యధికంగా వచ్చాయి. ఆరు రోజుల పాటు 1,771 అర్జీలు రాగా శనివారం 1421 అందాయి. వాటిని స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులు ఇప్పటి వరకు 1,896 దరఖాస్తులను పరిష్కరించారు. ఈ నెల 28వరకు పరిష్కరించేందుకు గడువు ఉంది. మిగతావి రెండు, మూడు రోజుల్లోనే పరిష్కారమయ్యే అవకాశముంది. ఈ నెల 28న ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామని జిల్లా పంచాయతీ అధికారి ఎస్.శ్రీలత తెలిపారు. పంచాయతీ పరిధిలోని ప్రతీ ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా కార్యదర్శులు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఒక కుటుంబంలోని వారందరినీ ఒకే వార్డులో ఉండేలా జాబితాలను సిద్ధం చేయాలని ఆమె సూచించారు.

సర్వర్ డౌన్

- రెండు నెలల రెవెన్యూ డాటా గల్లంతు!
- 'మీసేవ'లో తరచూ సాంకేతిక సమస్యలు
- దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు



మీసేవ కేంద్రం

కైలాస్‌నగర్: జిల్లాలోని మీసేవ కేంద్రాల ద్వారా అందించాల్సిన సేవలకు ఇటీవల అంతరాయం ఏర్పడుతోంది. తరచూ సర్వర్‌డౌన్ సమస్య తలెత్తడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. రెవెన్యూ శాఖ ద్వారా జారీ చేసే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి ఈసీ పొందేందుకు సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల డాటా లభ్యంకాకపోవడంతో వారు కంగుతింటున్నారు. తమకు సర్టిఫికెట్లు అందుతాయా లేదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొరాయింపు

జిల్లాలో 72 మీసేవ కేంద్రాలున్నాయి. వీటి ద్వారా పలు ప్రభుత్వశాఖలకు సంబంధించిన 359 రకాల సేవలు అందుతున్నాయి. అయితే ఇటీవల తరచూ సర్వర్‌డౌన్ అవుతుండంతో వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఆయా కేంద్రాలకు వెళ్లిన వారు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ముఖ్యంగా రెవెన్యూశాఖకు సంబంధించి కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, మున్సిపల్‌కు సంబంధించి జనన, మరణ, రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి ఈసీ, కార్మికశాఖకు సంబంధించి కార్మికుల గుర్తింపు కార్డులు పొందందేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. దరఖాస్తుదారులు తమకు సంబంధించిన సమాచారంతో కూడిన డాక్యుమెంట్స్‌ను అందజేసి దరఖాస్తు ఓకే అయినట్లుగా కన్పిస్తున్నా సెల్‌ఫోన్లకు సమాచారం రావడం లేదు. సర్టిఫికెట్లు అయినట్లుగా ఆన్‌లైన్‌లో చూపుతుండగా వాటిని డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆదాయ ధ్రువీకరణ పత్రంలో అభ్యర్థులకు సంబంధించిన ఫొటో రావడం లేదు. మిగతా సేవలకు సంబంధించి సర్టిఫికెట్లు కూడా జనరేట్ కావడం లేదు.

జిల్లాలో..

మండలాలు	18
మీ సేవ కేంద్రాలు	72
కేంద్రాల ద్వారా అందించే సేవలు	359

డాటా నాట్ ఫౌండ్ ...

ఈ ఏడాది జూలై 10నుంచి సెప్టెంబర్ 12వరకు మీ సేవ ద్వారా కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల డాటా ఆన్‌లైన్‌లో ప్రస్తుతం లభ్యం కావడం లేదు. రాష్ట్రస్థాయిలో తలెత్తిన సమస్యల కారణంగానే రెవెన్యూశాఖకు సంబంధించిన ఈ సమాచారం లభించడం లేదని, ఫలితంగా వారి సర్టిఫికెట్లు రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. అలాంటి వారు దరఖాస్తు చేసుకున్న డాక్యుమెంట్స్‌తో పాటు మీసేవ రశీదు తీసుకొస్తే మరోసారి వాటిని అప్‌లోడ్ చేస్తామని చెబుతున్నారు. విషయం తెలియక, రెండు నెలలుగా దరఖాస్తుదారులు ఆందోళనకుగురవుతున్నారు. రెవెన్యూ శాఖనే కాదు మిగతా శాఖలకు సంబంధించిన సేవలదీ ఇదే పరిస్థితి అని దరఖాస్తుదారులు చెబుతున్నారు. మీసేవ నిర్వాహకులు సమస్యను అధికారులకు నివేదిస్తున్నామని చెబుతున్నప్పటికి పరిష్కారం మాత్రం లభించడం లేదు. ఈ విషయంపై జిల్లా ఈ–మేనేజర్ బండి రవిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన సమాధానం చెప్పేందుకు నిరాకరించడం గమనార్హం.

మహిళా సాధికారత దిశగా అడుగులు



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే బొజ్జు తదితరులు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధి దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నా రు. కేబీ ప్రాంగణంలో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే బొజ్జుతో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. మండలంలోని శ్యాంపూర్ మహిళా శక్తి సమాఖ్యలోని 96 సంఘాలకు రూ.5.09 కోట్ల రుణాలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం మొబైల్ అంబులెన్స్‌లను ప్రారంభించారు. పలువురికి ఎలక్ట్రానిక్ ట్రైసైకిళ్లు అందించారు. గిరిజన బీఈడీ కళాశాలలో రూ.60 లక్షలలో నిర్మించిన బాలికల వసతి గృహం, వికాసం బాలబడికి మంజూరైన రూ.60 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం పౌల్ట్రీఫామ్‌ను ప్రారంభించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పలు సంఘాల నాయకులు సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందించారు. ఇందులో ఆదిలాబాద్, కుమురంభీం కలెక్టర్లు రాజర్షిషా, వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు సుగుణ తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు



సమావేశానికి హాజరైన ఆదివాసీ పెద్దలు

ఉట్నూర్‌రూరల్: తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష తప్పదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఉట్నూర్‌కు విచ్చేసిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని, ఈ మేరకు అందరూ సంయమనం పాటించాలన్నారు. జైనూర్ ఘటనపై ఆదివాసీ పెద్దలతో చర్చించి వారి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విషయాన్ని సీఎం దృష్టికి సైతం తీసుకు వెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, రాయిసెంటర్ల సార్‌మేడీలు, పటేళ్లు, ఆదివాసీపెద్దలు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ జోనల్ పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్‌స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు సత్తా చాటారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఈ పోటీల్లో స్థానిక క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ శిక్షకుడు కబీర్‌దాస్ తెలిపారు. అండర్–14 విభాగంలో సాయిప్రియ, సింధు, వైష్ణవి, నావిక, జస్వంత్ విజేతలుగా నిలిచారు. అలాగే అండర్–17 విభాగంలో ఐశ్వర్య, శాలిని, ఆకాశ్, లక్ష్మణ్, ప్రణీత్ విజేతలుగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, పెటా క్యాదర్శి స్వామి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

వందేభారత్, కేరళ ఎక్స్‌ప్రెస్ మంచిర్యాలలో నిలపాలి



రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ట్రస్మా బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో కేరళ ఎక్స్‌ప్రెస్, వందేభారత్ రైళ్లను నిలపాలని ట్రస్మా ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రామగుండంతో పోల్చితే మంచిర్యాల రైల్వేస్టేషన్ ఐదు, ఆరు రెట్లు కంటే ఎక్కువగా రద్దీ, ఆదాయం సమకూరుతున్న విషయాన్ని దృష్టికి తీసుకువచ్చారు. నవంబర్, డిసెంబర్, జనవరిలో అయ్యప్ప భక్తులు వేలాది మంది మంచిర్యాల మీదుగా శబరికి వెళ్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రయాణికుల సౌకర్యవంతంగా ఉండేలా మంచిర్యాలలో ఈ రైళ్లు ఆపాలని కోరారు. ట్రస్మా జిల్లా, రాష్ట్ర బాధ్యులు కస్తూరి పద్మచరణ్, విష్ణువర్ధన్‌రావు, దుర్గాప్రసాద్, ప్రకాశ్ కుమార్, సాధిక్‌పాషా, ఉస్మాన్‌పాషా, థామస్, విక్రమ్‌రావు, బాలమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన మేశినేని శంకర్‌కు చెందిన గేదె పిడుగుపడి మృతిచెందింది. శుక్రవారం ఉదయం మేతకు వెళ్లిన గేదె రాత్రి అయినా తిరిగిరాలేదు. శనివారం ఉదయం వెతకుతుండగా గ్రామశివారులోని చేనులో మృతిచెంది కనిపించింది. దీని విలువ రూ.70 వేలు ఉంటుందని బాధితుడు శంకర్ తెలిపారు. పశువైద్యాధికారి సంపత్, ఆర్ఐ విజయలక్ష్మి పంచనామా నిర్వహించారు.

ఆటో బోల్తా..బాలుడి మృతి

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి నందగిరి వసీకర్ (11) మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు..భైంసాకు చెందిన నందగిరి సాయినాథ్ భార్యపిల్లలతో కలిసి తన ఆటోలో శనివారం తానూరు వెళ్తున్నారు. అదే సమయంలో గాలులు వీచి ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. ఒక్కసారిగా బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుమారుడు వసీకర్‌ను కుటుంబీకులు భైంసా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చంపేశారు!?

- రిమ్స్ ఓటీటీ విద్యార్థి అనుమానాస్పదంగా మృతి
- విషం తాగించి, చితకబాదారని కుటుంబీకుల ఆరోపణ
- మృతదేహంతో రోడ్డుపై భైఠాయింపు
- బంధువుల ఆందోళన



జితేందర్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్: చేతికి అందివచ్చిన కుమారుడు కష్టపడి చదివి ప్రయోజకుడు అవుతాడని భావించిన తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. రిమ్స్‌లో బీఎస్సీ ప్రథమ సంవత్సరం ఓటీటీ చదువుతున్న విద్యార్థి శనివారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులతోపాటు బంధువులు ఆందోళనకు దిగారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరైన తీరును చూసి పలువురు కంటతడిపెట్టారు. కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహంతో ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. విద్యార్థి సంఘాలతోపాటు పలువురు మద్దతు ప్రకటించారు. విషం తాగించి, చితకబాదడంతో కుమారుడు మృతిచెందాడని, బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అసలేం జరిగిందంటే..

నార్నూర్ మండలం చోర్‌గావ్‌కు చెందిన ధన్యాస్ రాథోడ్–మీరాబాయి దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు జితేందర్ (18) జిల్లా కేంద్రంలోని పిట్టలవాడలో గల ప్రభుత్వ గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో ఉంటూ రిమ్స్‌లో బీఎస్సీ ఓటీటీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబీకులు, స్నేహితులు తెలిపిన వివరాలు..శుక్రవారం రాత్రి 8 గంటలకు వసతి గృహంలో ఉన్న జితేందర్‌కు ఎవరో ఫోన్ చేసి బయటకు రావాలని పిలిచారు. గేటు వద్దకు వచ్చిన ఆయన్ను గుర్తుతెలియని నలుగురు బలవంతంగా వసతిగృహ సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనంపైకి తీసుకెళ్లారు. మద్యంలో విషం కలిపి తాగించి, చితకబాదడంతో స్పృహ కోల్పోయాడు. గంట తర్వాత స్పృహలోకి వచ్చి తోటి స్నేహితులు, తన బంధువుకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు.



విద్యార్థి సంఘాల రాస్తారోకో

ఊరివాళ్లే..

తమ ఊరికి చెందినవారే కుమారుడిని చంపి ఉంటారని కుటుంబీకులు ఆరోపించారు. ఇటీవల జరిగిన తీజ్ ఉత్సవాల్లో జరిగాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఓ కాలనీలో నివాసం ఉండే వారితో చితకబాది, విషం తాగించారని కుమారుడు చెప్పినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు.

స్నేహితులు అక్కడికి చేరుకుని శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో రిమ్స్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబీకులు శనివారం ఉదయం ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆ విద్యార్థి మృతి చెందాడు.

విద్యార్థులకు రక్షణేది..

వసతి గృహంలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్ వద్ద ఏబీవీపీతోపాటు పలు సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్టీ వసతి గృహంలో కనీసం నైట్ వాచ్‌మెన్ లేరని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉందన్నారు. హాస్టల్‌కు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుటుంబీకుల ఆందోళన

అనుమానాస్పదంగా మృతిచెందిన ఆ విద్యార్థి కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించకుండా అడ్డుకున్నారు. ఆస్పత్రి వద్ద పెద్దఎత్తున గుమిగూడి ఆందోళన చేపట్టారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి నుంచి బయటకు శవాన్ని తీసుకుచ్చి అంబులెన్స్‌లో పోలీసులు ఎక్కించేందుకు యత్నించగా అడ్డుకున్నారు. కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. బలవంతంగా మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కించిన తర్వాత వాహనాన్ని అడ్డుకున్నారు. బస్టాండ్ ప్రాంతంలో శవంతోపాటు భైఠాయించారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్‌రావులు కుటుంబీకులకు నచ్చజెప్పినా వినకుండా భీష్మించుకూర్చున్నారు. ఇదిలా ఉండగా శనివారం మధ్యాహ్న సమయంలో ఆదిలాబాద్ డీఎస్పీ, రూరల్ సీఐ ఫణిందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తోటి విద్యార్థులను విచారించారు. మృతుడి సోదరుడు అజయ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మావల ఎస్సై తెలిపారు.



కుటుంబీకులకు నచ్చజెప్తున్న పోలీసులు

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

- ఎంపీ గోడం నగేశ్



సురేశ్ మహారాజ్‌తో ఎంపీ నగేశ్, తదితరులు

ఇంద్రవెల్లి: సంస్కృతి సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని ఏమాయికుంట గ్రామంలో శనివారం నిర్వహించిన రుషి పంచమి ఉత్సవాల్లో సాయంత్రం పాల్గొన్నారు. ముందుగా కాలుబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. సురేష్ మహారాజ్ నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గని వద్ద మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి అసిస్టెంట్ సెక్రెటరీ మోత్కూరి కొమరయ్య తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. మైనింగ్ స్టాఫ్ విధుల్లో జోక్యం చేసుకుంటూ లెక్కపంచే క్రమంలో జోక్యం చేసుకుంటూ తమను ఇబ్బందికి గురిచేస్తున్నారన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని తెలిపారు. ఆయన చెప్పినా వారికి, వారు కోరిన పనులకు పురమాయించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. విధుల్లో ఆయన జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. ఈ నిరసనకు సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి శ్రీను మద్దతు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- భర్త ఫిర్యాదుతో కేసు నమోదు

నిర్మల్‌టౌన్: వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలోని చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని షేక్ సాహెబ్‌పేట్‌కు చెందిన అఫ్రోజ్ అహ్మద్ ఖాన్ తన భార్య ఫర్హానాజ్ (37)కు పురిటినొప్పులు రావడంతో శుక్రవారం మధ్యాహ్నం బస్టాండ్ సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యురాలు..ఆమెను పరీక్షించి సిజేరియన్ ఆపరేషన్ చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ తర్వాత ఆమెకు అధిక రక్తస్రావమైంది. వెంటనే అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు ఆమెను అక్కడికి వెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శనివారం మృతదేహంతో నిర్మల్‌లోని ఆస్పత్రి వద్దకు చేరుకుని భర్త, కుటుంబీకులు, బంధువులు ధర్నా చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సుమారు 5 గంటల వరకు ధర్నా కొనసాగడంతో ట్రాఫిక్ ఏర్పడింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



రుతుజరెడ్డి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ మహిళ ఘటన స్థలంలో మృతిచెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం..తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి చెందిన ఎల్మ రాకేశ్‌రెడ్డి, రుతుజరెడ్డిలు ద్వారకానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శనివారం సాయంత్రం ఆదిలాబాద్ నుంచి జైనథ్ మండలంలోని దీపాయిగూడకు బైక్‌పై వెళ్తున్నారు. తిర్పెల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలై రుతుజ (30) ఘటన స్థలంలో మృతిచెందింది. భర్త రాకేశ్‌రెడ్డితోపాటు చిన్న కూతురు (ఏడాదిన్నర వయస్సు గల) టియారాకు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలికి నాలుగున్నరేళ్ల కూతురు అరుణ్య ఉంది. ఈమేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు రిమ్స్‌కు చేరుకున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నర్సాపూర్(జి): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం..మండలంలోని గొల్లమాడకు చెందిన పొట్ట గజ్జారాం (70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందినా తగ్గకపోవడంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు భైంసా ఏరియాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పెద్ద కుమారుడు రవి ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య సత్తవ్వ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి

బేల: మండలంలోని సిర్సన్న రెవెన్యూ గ్రామశివారులోని ఓ చేనులో పిడుగుపాటుకు శనివారం వ్యవసాయ కూలీ రాథోడ్ అవినాష్(22) మృతిచెందాడు. కూలీ పనికి వెళ్లి తిరిగివస్తుండగా సమీపంలో పిడుగుపడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి..

కాసిపేట: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని కొండాపూర్ యాపకు చెందిన వెంకటేశ్(32) బుధవారం మల్కేపల్లి శివారులోని పంట చేనులో గడ్డి మందు తాగాడు. కొద్దిసేపటికి ఇంటికి రావడంతో గమనించిన కుటుంబీకులు ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడం, ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇటీవల తీవ్ర మానసిక వేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు మురుగుకాల్వలో పడి..

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సుభాష్‌చంద్రకాలనీకి చెందిన మిరిదొడ్డి శంకర్ (56 మురుగుకాల్వలో పడి మృతిచెందాడు. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం..శుక్రవారం రాత్రి ఇంటి పని నిమిత్తం సైకిల్‌పై మార్కెట్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా మురుగుకాల్వలో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం మురుగుకాల్వలో పడి ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి భార్య తార ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులకు

బోనస్ చెల్లించాలి

- హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులకు బోనస్‌గా రూ.10 వేలు చెల్లించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రకటించిన లాభాల బోనస్‌ను ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మి కులకు వర్తింపజేయాలన్నారు. యాజమాన్యం ఏటా ఎస్టీపీపీ నుంచి వేలకోట్ల లాభా లు ఆర్జిస్తున్నప్పటికి రాత్రింబవళ్లు విద్యుత్ ఉత్పత్తికి కష్టపడుతున్న కార్మికులకు ఎలాంటి బోనస్ చెల్లించకపోవడం బాధాకరమన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు ప్రకటించిన రూ.5వేల బోనస్‌ను పవర్ ప్లాంటు కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు నవీన్, ఎండీ.హజార్‌పాషా, అంజి, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌ఓ దేవయ్య

బెల్లంపల్లి: ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. వినాయక నిమజ్జనం రోజున బెల్లంపల్లి హన్మాన్ బస్తీకి చెందిన వేల్పుల శ్రావణ్‌పై ఈనెల 16న రాసబత్తుల గణేశ్(బెల్లంపల్లి), గుగ్గుస్ శ్రీనివాస్ (మహారాష్ట్ర) అలియాస్ రామటెంకి శ్రీనివాస్ కత్తితో దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటనలో శ్రావణ్‌కు గాయాలయ్యాయని, పాత కక్షల కారణంగానే దాడి జరిగినట్లు ఎస్‌హెచ్‌ఓ వివరించారు. ఈమేరకు నిందితులిద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రోద్బలంతోనే భవనం కూల్చివేత

- ఇంట్లోనే రూ.20లక్షల నగదు, 30 తులాల బంగారం
- త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తాను
- టీబీజీకేఎస్ మాజీ నాయకుడు దీకొండ అన్నయ్య



మాట్లాడుతున్న దీకొండ అన్నయ్య

నస్పూర్: తన భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నా రాజకీయ ప్రోద్బలంతోనే అధికారులు కూల్చివేశారని టీబీజీకేఎస్ మాజీనాయకుడు దీకొండ అన్నయ్య ఆరోపించారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో నస్పూర్ శివారు సర్వేనంబర్ 40/2లో 350 గజాలను పొనుగంటి ప్రేమలత వద్ద నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించానని తెలిపారు. 2021లో మున్సిపల్ పర్మిషన్ తీసుకుని ఇంటిని నిర్మించినట్లు పేర్కొన్నారు. 2023లో అధికారులు ఇంటి నంబర్ కేటాయించగా రూ.34,330 ఇంటి పన్ను చెల్లించానన్నారు. 2022లో నోటీసులు జారీ చేసినప్పుడు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. గత జూన్‌లో, 15 రోజుల క్రితం నోటీసులు జారీ చేశారని కమిషనర్ సతీశ్ అనడం అవాస్తవమన్నారు. ఇంటిని కూల్చే ముందు సామగ్రి తీసుకునే సమయం ఇవ్వలేదన్నారు. పోలీసులు తనను, కుమారుడు, కుటుంబ సభ్యులను బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కి తరలించారని ఆరోపించారు. దళితుడి అయిన తనపై రాజకీయకక్ష సాధింపులో భాగంగా రూ.2. కోట్లు విలువ గల భవనాన్ని నేల మట్టం చేశారని ఆరోపించారు. ఇంట్లోనే రూ.20 లక్షల నగదు, 30 తులాల బంగారు ఆభరణాలు, స్టడీ సర్టిఫికేట్లు, డాక్యుమెంట్లు, రూ 60 లక్షలు విలువ చేసే సామగ్రి ఉండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. సమావేశంలో అన్నయ్య కుమారుడు నవీన్‌కుమార్, అల్లుళ్లు రాజ్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

లాభాల వాటా పంపిణీలో అన్యాయం



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన వాస్తవ లాభాల్లో నుంచి వాటా పంపిణీలో కార్మికులకు అన్యాయం జరుగుతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. వాస్తవ లాభాల్లో నుంచి 33 శాతం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మందమర్రిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణికి రూ.4,071 కోట్ల లాభాలు వస్తే రూ.2,412 కోట్లలో 33 శాతం లాభాలు పంపిణీ చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ మామూళ్ల కింద రూ.2,289 కోట్లు పక్కన పెట్టిందని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా, టీబీజీకేఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్నప్పుడు వాస్తవ లాభాల్లో నుంచి పెట్టుబడి పేరిట కోత విధించలేదని గుర్తుచేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి కార్మికులకు నష్టం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఇదివరకు జరిగిన ఒప్పందం మేరకే కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటాలో రూ.5 వేలు ఇస్తున్నారని తెలిపారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొముురయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటరమణ, నాయకులు రవీందర్, రాజశేఖర్, బడికెల సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐలో చోరీకి యత్నించిన దొంగల అరెస్టు

- వారం రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

ముధోల్: మండల కేంద్రంలోని ఎస్బీఐలో ఈనెల 13న చోరీకి యత్నించిన దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో సీఐ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పాత బస్టాండ్ సమీపంలో గల ఎస్బీఐ వెనుకభాగంలో వెంటిలేటర్‌కు ఉన్న ఇనుపచువ్వలు తొలగించి చొరబడ్డారు. సీసీ కెమెరాలు, అలారం వైర్లు కత్తిరించి చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బందితో కలిసి రెండు టీంలు ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేశారు. సీసీపుటేజీలను పరిశీలించారు. ముధోల్‌కు చెందిన షేక్ మోసిన్ అహ్మద్, మమ్మద్ ఇర్ఫాన్ ఉద్దీన్‌లను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులను సీఐ అభినందించారు. అనంతరం సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్‌లను ఎస్బీఐ మేనేజర్ వి.గిరి సన్మానించారు.

పార్కు కాదు.. కోనేరు



బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం. అధికారుల నిర్లక్ష్యంతో కోనేరు వ్యర్థాలతో నిండి కంపుకొడుతోంది. చెత్తాచెదారం కోనేరు పక్కనే వేసి కాల్చివేస్తున్నారు. దీంతో పొగతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇక కోనేరు నిండా.. నాచు, పిచ్చిమొక్కలు పెరగడంతో ఇలా పచ్చగా కనిపిస్తోంది. బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని మహిళలు బతుకమ్మలను ఆలయం కోనేటిలోనే నిమజ్జనం చేస్తారు. మిగతా రోజుల్లో కోనేటిని ఎవరూ పట్టించుకోరు. దీంతో ఇలా గుర్రపుడెక్కతో నిండియింది. ఏటా గంగపుత్రులతో పుష్కరిణిని శుభ్రం చేయిస్తారు. గతేడాది శుభ్రం చేయించిన డబ్బులు పూర్తిగా చెల్లించకపోవడంతో ఈసారి శుభ్రం చేయడానికి వారు రావడం లేదని తెలిసింది. బతుకమ్మ పండుగ నేపథ్యంలో కోనేరు శుభ్రం చేయించాలని పట్టణ మహిళలు కోరుతున్నారు.

